క్లుప్తంగా

'తమ్మినేని'ని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా


తమ్మినేని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి తమ్మినేని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమ్మినేని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్యంగా తిరిగి వస్తారని భరోసా కల్పించారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి..



దేవరుప్పుల: మండలంలోని కడవెండిలో బీఆర్‌ఎస్ మండల నాయకుడు దుబ్బాక రత్నాకర్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి మృతి చెందాడు. కాగా, బీఆర్‌ఎస్ మండల నాయకులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పల్ల సుందర్‌రామిరెడ్డి, తీగల దయాకర్, చింత రవి, బస్వ మల్లేశం, సుడిగెల హన్మంతు, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

దేవరుప్పుల: ఈ నెల 14వ తేదీన జనగామ–సూర్యాపేట రహదారి కామారెడ్డిగూడెం పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై కొంగరి శ్రవణ్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పెనుగొండ వెంకటేష్ (25) జీవనోపాధి కోసం వలస వచ్చి యాదాద్రి భువగిరి జిల్లా మొత్కూరు మండలం అమ్మనబోలులో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే 14వ తేదీన దేవరుప్పులకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఎంఎస్‌ఆర్ గార్డెన్ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలైంది విదితమే. ఈ సంఘటనలో తీవ్రగాయాలపాలైన వెంకటేష్ అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో పీఏసీఎస్ డైరెక్టర్ మృతి


అమరేందర్ (ఫైల్)

తరిగొప్పుల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ ఎండబట్ల అమరేందర్(47) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. తెల్లవారు జామున అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు మండలకేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు వరంగల్ తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. కాగా, అమరేందర్ పార్థివదేహానికి ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డి నివాళులర్పించి రూ.5,000 సాయం అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి, ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, లింగం , మల్యాల సుధీర్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

భద్రకాళి అమ్మవారికి పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని హైదరాబాద్ ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఆనంద్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈమేరకు ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. తొలుత ఆదిశంకరులు, వల్లభ గణపతిని ఆనంద్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ స్నపన మందిరంలో ఆయనకు అర్చకులు మహాదాశీర్వచనం అందజేశారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

హన్మకొండ అర్బన్: కేంద్ర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత వైద్య చికిత్సల నిమిత్తం వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ (సీజీహెచ్‌ఎస్)ను కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, హనుమకొండ జిల్లా శాఖ తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి వస్తున్న సీజీహెచ్ ఎస్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఘనంగా స్వాగతం పలుకనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు

● ఏసీపీ సుందరగిరి శ్రీనివాస్‌రావు


కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఏఎఫ్ పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఏ సమయంలో అయినా ప్రజలకు మేమున్నామంటూ భరోసా కల్పించేందుకే ఆర్‌ఏఎఫ్ పోలీసుల కవాతు అని ఏసీపీ సుందరగిరి శ్రీనివాస్‌రావు అన్నారు. డివిజన్ కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు బుధవారం ఆర్‌ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ టీపీ భగేల్, అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవార్ ఆధ్వర్యంలో 65 మంది సిబ్బందితో చేపట్టిన కవాతును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు, ఇతర ఎన్నికల నిర్భయంగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసులు వెన్నంటి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఏఎఫ్ ఇన్‌స్పెక్టర్లు రాబిన్‌బాబు, జాట శంకర్‌యాదవ్, ప్రకాష్‌కుమార్, కఫీద్ అహ్మద్, ఘన్‌పూర్, జనగామ రూరల్ సీఐలు సట్ల రాజు, ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు నాగరాజు, మహేందర్, వినయ్‌కుమార్, రఘుపతి, ప్రవీణ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు డబ్బులు జమచేయాలి


మాట్లాడుతున్న సాయన్న

రఘునాథపల్లి: రబీ సాగుకు పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు వెంటనే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆది సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ నాయకుడు గొరిగె సోమయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రబీ సీజన్ మొదలై నెల దాటినా రైతుబంధు డబ్బులు ఖాతాలో జమ చేయకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా సత్వరం రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కావటి యాదగిరి, మండల కమిటీ సభ్యులు మడికంటి సోమయ్య, ముప్పిడి ఎల్లయ్య, చాడ ఎల్లయ్య, పండుగ మల్లేషం, బాల్నె ఉదయ్, చిట్యాల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా దీపాలు వెలిగించాలి

చిల్పూరు: అయోధ్యలోని భవ్య రామమందిరంలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ రోజైన 22 (సోమవారం) ప్రతీ ఒక్కరూ ఇంటి ముందు ఉదయం, రాత్రికి దీపాలను వెలిగించాలని బీజేపీ జిల్లా నాయకుడు తోట శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన అక్షితలకు పూజలు చేసి దీపాలను వెలిగించాలని అన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్

నర్మెట: ఓటరు నమోదుకు ఎలక్షన్ కమిషన్ మరోసారి అవకాశం కల్పించిందని 18 ఏళ్లు నిండిన వారు ఓటరు లిస్టులో తమపేరును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో బీఎల్‌ఓలు ఆయా గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టనున్నారని తెలిపారు. కొత్తగా నమోదుకు ఫాం–6, సవరణలకు ఫాం–8, మృతి చెందిన వారిపేర్లను తొలగించుటకు ఫాం–7 పూరించి ఇవ్వాలని తెలిపారు. యువతీ యువకులు, సవరణలు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

క్రషర్ డస్టుతో అదుపుతప్పుతున్న వాహనాలు


అండర్ బ్రిడ్జి కింద లారీలో నుంచి పడిన క్రషర్ డస్టు

చిల్పూరు: మండలంలోని నష్కల్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద బుధవారం సాయంత్రం టిప్పర్ నుంచి క్రషర్ డస్టు పడడంతో వాహనాలు అదుపుతప్పి పడడంతో పాటు పాదచారులు ఇబ్బంది పడ్డారు. సాధారణంగా ఇటుకల తయారీకి క్రషర్‌లోని డస్టును వాడుతారు. దీన్ని లారీలు, టిప్పర్లలో తరలించే ముందు రోడ్లపై పడకుండా వాహన యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇక్కడ అలాంటిది ఏమీ లేకుండా తీసుకెళ్తుండగా బ్రిడ్జి కింద క్రషర్ డస్టు పడింది. అక్కడ నీరు నిలిచి ఉండడంతో బురదగా మారింది. దీంతో ద్విచక్రవాహన చోదకులు వెళ్తూ జారిపడ్డారు. అంతే కాకుండా పాదచారులు సైతం ఇబ్బందికి గురయ్యారు. ఈ విషయంపై సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, పంచాయతీ కార్యదర్శి స్నేహ మాట్లాడుతూ డస్టుతరలించిన వాహనాలను గుర్తించి వారిపై చర్య తీసుకుంటామని, వెంటనే అక్కడ శుభ్రం చేయిస్తామని తెలిపారు.

శ్మశాన వాటికను నిర్మించాలి


సీపీఎం జెండాను ఎగురవేస్తున్న ప్రకాష్

జనగామ రూరల్: పట్టణంలోని 5వ వార్డు బాణాపురంలో శ్మశాన వాటికను నిర్మించాలని కలెక్టర్ శివలింగయ్యను సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ కోరారు. బుధవారం 5 వార్డులో ఏర్పాటు చేసిన పార్టీ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏసీరెడ్డి నగర్‌లో 800 కుటుంబాలు నివసిస్తున్నాయని, అనుకోకుండా ఎవరైన మృతి చెందితే నడుచుకుంటు నెహ్రూ పార్క్ వరకు 3 కిలో మీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతాదృక్పథంతో ప్రభుత్వ స్థలంలో శ్మశాన వాటికను నిర్మించాలని కోరారు. సమావేశానికి ముందు ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బి.వెంకటేష్, లింగం, కృష్ణ, మల్లేష్, విజయ, రజీయా, రేణుక, సరోజన తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


రాజు, అధ్యక్షుడు


భానుప్రకాష్, ప్రధాన కార్యదర్శి

జఫర్‌గఢ్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ఎన్నికల అధికారి మంగు జయప్రకాష్ అన్నారు. తిమ్మంపేట ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడంతోపాటు పదోన్నతులు కల్పించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం..

యూటీఎఫ్ మండల నూతన అధ్యక్షుడిగా కోరుకొప్పుల రాజు ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా పి.భానుప్రకాష్, ఉపాధ్యక్షుడిగా సిహెచ్ ఉమారాణి, వి.శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎస్ సునీతాదేవి, ఎండీ సలావుద్దీన్, బి.బాలాజీ, డి.శ్యామల, కన్వీనర్లుగా పి.మహేందర్, పి.మంజుల, ఎస్.సుస్మిత, జిల్లా కౌన్సిలర్లుగా కె.రంజిత్‌కుమార్, ఎం.జయప్రకాశ్, టి.సుధాకర్, బి.వసంత్‌కుమార్ ఎన్నికైన వారిలో ఉన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

జనగామ రూరల్: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని జగిత్యాల పోరాటం చేస్తున్న నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని ఏఐకేఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూపార్క్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు చందు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో సర్వేనంబర్ 437లో 387 ఎకరాల్లో గుడిసేలు వేసుకొని 4వేల మంది నివసిస్తున్నారు. పోలీసులచే గుడిసెలు ధ్వంసం చేసి నాయకులపై కేసుపెట్టడం అన్యాయమన్నారు. 30 మందిని జైలు పంపి పేదలపై దౌర్జన్యం చేపట్టడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలతో పాటు రూ.15 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీట్యానాయక్, సురేష్, ఉపేందర్, మహేందర్, నరేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు


శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

జనగామ: హరిహర సుతుడు అయ్యప్ప స్వామి మండల దీక్షలు ధరించిన జనగామకు చెందిన స్వాములు బుధవారం ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు బయలుదేరారు. జిల్లా కేంద్రంలోని మహంకాళి ఆలయంలో బ్రహ్మశ్రీ పుచ్చా నరసింహ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి తీసుకుని, శబరిమల పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. అనంతరం బాణాపురం అయ్యప్ప దేవాలయ ప్రధాన అర్చకుడు కాసోజు రాజేశ్వరాచార్యులు ఇరుముడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములను సాగనంపేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. గురుస్వాములు ఓరుగంటి సంతోష్ కుమార్, కస్తూరి వేణుగోపాల్, కొల్లూరి ఆనందం, పోతర్ల శ్రీనివాస్ స్వామి, వట్టుపల్లి రేవంత్, గుగులోత్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న రాములు

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటలో ఎండీ షాబుద్దీన్ ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను పోతుల రాములు యాదవ్ పరామర్శించి రూ. 5 వేల సాయం అందించారు. మామిడి ఐలయ్య, బుడిగె రామచంద్రం, తుప్పతి చంద్రయ్య, ఈర్ల శివరాములు, వస్పరి నర్సింహులు, దొమ్మాట వెంకటేశం, కొక్కలకొండ బాబు, లింగం, సిద్దులు, భాస్కర్, కిష్టయ్య, రేణికుంట సత్యనారాయణ ఉన్నారు.

బియ్యం అందజేత

పోచన్నపేటలో ఇటీవల మృతి చెందిన రెంట సిద్ధిమల్లయ్య, ఎండీ షాబుద్దీన్ కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ నాయకుడు గూడ సిద్దారెడ్డి 50 కిలోల చొప్పున బియ్యాన్ని అందించారు. మండల సమన్వయకర్త ఎండీ ఫిరోజ్, ఎంపీటీసీ మామిడి అరుణ, కంసాని మహేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

గద్దెను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి


గద్దె కూల్చివేసిన చోట పాపన్న చిత్రపటాన్ని ప్రతిష్ఠిస్తున్న కల్లుగీత కార్మికులు

తరిగొప్పుల: మండలకేంద్రంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు కోసం నిర్మిస్తున్న గద్దెను ధ్వంసం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి సర్వాయి పాపన్న గద్దెను ధ్వంసం చేయగా అట్టి ఘటనా స్థలాన్ని సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్యతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటంతో నిరసన ర్యాలీ నిర్వహించి ప్రతిష్ఠించారు. అనంతరం గోపి మాట్లాడుతూ మండలకేంద్రానికి చెందిన మాశెట్టి వేణుగోపాల్, మాశెట్టి శ్రీనివాస్, మాశెట్టి సందీప్ వారి అనుచరులతో గద్దెను ధ్వంసం చేయడం జరిగిందని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే స్థానంలో పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునే విధంగా సహకరించాలని పోలీసులను కోరారు. మండల అధ్యక్షుడు తాళ్లపల్లి పోషయ్య, జొన్నగోని శ్రీనివాస్, సుదర్శన్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, వంగ రామరాజు, పలుచాని రమేష్, జాగీరు మల్లేషం, పరుశరాములు, విజయ్, సత్యనారాయణ, పొగాకుల రవి, శంకరయ్య, లింగం, మూల రాములు, శ్రీరాములు, రమేష్ పాల్గొన్నారు.

'షాపు ఎదుట వద్దంటే రాజకీయం చేస్తున్నారు'

తరిగొప్పుల: ఎరువుల కోసం వచ్చే రైతులకు ఇబ్బందికలుగుతుందని షాపు ఎదుట విగ్రహం ఏర్పాటు చేయొద్దన్నందుకు రాజకీయం చేస్తున్నారని, గద్దె నిర్మాణం ధ్వంసం చేశామనడం బాధాకరమని ఫర్టిలైజర్ షాపు యాజమాని మాశెట్టి వేణుగోపాల్ అన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు దౌర్జన్యంగా తన ఎరువుల దుకాణం ఎదుట సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిసి సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి పోషయ్యను కలిశామన్నారు. దుకాణం ఎదుట విగ్రహం ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బంది కలుగుతుందని నిర్మాణం చేపట్టొద్దని కోరామని చెప్పారు. అయినప్పటికీ ట్రాక్టర్లతో కంకర, ఇసుక, ఇటుక, సిమెంట్ తీసుకొచ్చి గద్దె నిర్మాణం చేపట్టారని తెలిపారు. నిర్మాణం ఆపించామే కాని ధ్వంసం చేయలేదన్నారు. దుకాణం ఎదుట విగ్రహం ఏర్పాటు చేసి పొట్టగొట్టే ప్రయత్నం చేస్తున్నారని వాపోయాడు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు



బచ్చన్నపేట: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి సీఎం కావాలని మండలంలోని కొడవటూర్‌లోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు బొడ్డు ప్రవీణ్‌కుమార్ బుధవారం పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమార్థం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ సీఎంగా గెలవడం ఖాయమన్నారు.

నివాళి

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు లింగాల సత్తయ్య (65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎండీ అబ్బాస్‌మియా పార్టీ నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కొమ్మగల్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

వైన్‌షాపునకు అనుమతివ్వొద్దని వినతి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లులోని వైన్ షాపును షిఫ్టింగ్ చేసే క్రమంలో తమ వ్యవసాయ భూముల వద్ద ఏర్పాటునకు అనుమతి ఇవ్వొద్దని రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు గాండ్ల వెంకటేశ్వర్లు, గాండ్ల గట్టయ్య, శేషాల రాజు, గోలి రమేష్ విలేకరులతో మాట్లాడారు. ఛాగల్లు గ్రామంలో జాతీయ రహదారి పక్కన బొజ్జన్నచెరువు కింద తమతోపాటు 50 మందికి చెందిన వ్యవసాయభూములు ఉన్నాయన్నారు. గ్రామంలో గతంలో వైన్‌షాపు ఉన్నచోటు నుంచి ప్రస్తుతం తమ వ్యవసాయభూముల పక్కన ఉన్న ఇనుగాల నర్సింహారెడ్డికి చెందిన వ్యవసాయ భూమిలో వ్యాపారులు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తే మందుబాబులు ఇష్టారాజ్యంగా పక్కన ఉన్న తమ పొలాల్లో సీసాలు, వ్యర్థాలు వేస్తారని, సీసాలు పగులగొడుతారన్నారు. దాంతో రైతులతో పాటు పశువులకు ఇబ్బందిగా మారుతుందని, పంటల సాగు కష్టమవుతుందన్నారు. ఈ విషయమై ఎక్సైజ్ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి అక్కడ వైన్‌షాపు ఏర్పాటు చేయకుండా చూడాలని వారు కోరారు. లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలి


యాకయ్యకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

పాలకుర్తి: గౌడల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో సమితి జిల్లా అధ్యక్షుడు తాళ్ల సోమనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గౌడ కార్మికుల సంక్షేమం కోసం ఐక్యత అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా గౌడజన హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని విస్నూరు గ్రామానికి చెందిన బాలగాని యాకయ్యను నియమించారు. రాష్ట్ర కార్యదర్శి గిరగాని సమ్మయ్య, శెట్టి వెంకన్న, పూజారి నారాయణ, కుమారస్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబసును ఆదర్శంగా తీసుకోవాలి


జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కనకారెడ్డి తదితరులు

జనగామ రూరల్: నేటి యువత జ్యోతి బసును ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీకార్యాలయంలో కమ్యూనిస్టు నేత, పశ్చిమబెంగాల్ మాజీ సీఎం జ్యోతిబసు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కనకారెడ్డి మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో 34 ఏళ్ల పాటు సీపీఎం ముఖ్యమంత్రిగా జ్యోతిబసు పని చేసి దేశానికి గొప్ప మార్గనిర్దేశకుడు అయ్యారని అన్నారు. పార్టీ విధానాలు అమలు చేసి పేదలకు భూమి పంచిన ఘనత జ్యోతిబసుకే దక్కుతుందని తెలిపారు. దేశంలో మంచి గుర్తింపు పొందటమే కాకుండా ప్రధానమంత్రి పదవిని సైతం తిరస్కరించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపర్తి రాజు, ప్రకాష్, నరేందర్, చందు, మహేందర్, సురేష్, సుధాకర్, ధర్మబిక్షంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

200 రోజులకు చేరిన అన్నదానం


కేక్ కట్ చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

జనగామ రూరల్: లయన్స్ ఇంటర్నేషనల్ 320 ఎఫ్ జిల్లా పరిధిలోని రీజియన్ 6,7 సారథుల ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నదాన కార్యక్రమం బుధవారం నాటికి 200 రోజులకు చేరుకుంది. ఈమేరకు లయన్స్ ప్రతినిధులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అన్నదానం చేయడం వల్ల వేలమంది ఆకలి బాధలు తీరుతున్నాయని, ఆకలితో ఉన్నవారి కోసం అన్నదానం చేయడం గొప్ప విషయమని పూర్వ గవర్నర్ కన్నా పర్శరాములు, లవకుమార్ అన్నారు. ఈ కార్యక్రమలో లయన్స్ ప్రతినిధులు రవీందర్, ప్రమోద్, ఉపేందర్, ప్రభాకర్, కృష్ణ జీవన్, యాదగిరి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.